క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి సింహాద్రి పరామర్శ



కోడూరు: షిర్డీ యాత్రలో గుండెపోటుతో మృతి చెందిన పోటుమీద గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శీలం బాపనయ్య (సేభాష్) కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం స్మశానం వద్ద పరామర్శించారు. బాపనయ్య ఇటీవల షిర్డీ యాత్రకు వెళ్లి ట్రైన్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. రమేష్‌బాబు బాపనయ్య కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే మండలంలోని చినగుడుమోటు గ్రామానికి చెందిన పార్టీ అధికార ప్రతినిధి గుర్రం బసవయ్య ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. దీంతో బసవయ్యను కూడా రమేష్‌బాబు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల, గ్రామ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చిలకలపూడి(మచిలీపట్నం): షెడ్యూలు క్యాస్ట్‌కు చెందిన నిరుద్యోగ యువకులు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ షేక్ షాహెద్‌బాబు సూచించారు. స్థానిక డీపీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం నిరుద్యోగ ఎస్సీ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు 13 పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. ఆ పథకాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. నిరుద్యోగ యువకులు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సిబ్బందికి శిక్షణ



పెడన: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండే సిబ్బందికి ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పెడన మండలం ఏఓ ఎస్.జెన్నీ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సివిల్ సప్లయి శాఖ ట్రైనీలు సీహెచ్ చిన్నారి, లేఖశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ జెన్నీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసి సమయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వరి నాణ్యత ప్రమాణాలపై, వరిలో శాంపుల్ ఎలా తీయాలి వంటి విషయాలను ట్రైనీలు సిబ్బందికి వివరించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



గూడూరు: అకస్మాత్తుగా ఎవరికైనా గుండె కొట్టుకోవడం, శ్వాస ఆగిపోవడం సంభవించినప్పుడు వారి ప్రాణాలు కాపాడటానికి చేసే అత్యవసర వైద్య విధానం సీపీఆర్‌పై గురువారం ఆకులమన్నాడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అవగాహన నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన డెమోలో సీపీఆర్ ఏ విధంగా చేయాలనే విషయాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మొహమ్మద్ రఫీ, సి.హెచ్.ఓ డాలి సుకన్య, ఏఎన్ఎంలు మార్తారాణి, రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఆశ వర్కర్ ఇందిరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు తప్పిన ప్రమాదం

చల్లపల్లి: స్థానిక పోతురాజుస్వామి ఆలయం వద్ద ఉన్న మలుపులో ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి ఒక్కసారిగా రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. గమనించిన ఇరు బస్సుల డ్రైవర్లు చాకచక్యంగా బ్రేకులు వేసి తప్పించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎదురు వచ్చే వాహనాలను గమనించుకుంటూ నిదానంగా వెళితే ప్రయాణం సుఖవంతం అవుతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

- 9వేల ఎకరాలకు పైగా ఈ–పంట నమోదు పెండింగ్
- ఈ నెల 25తో ముగుస్తున్న గడువు

పెడన: రైతు తాను వేసిన పంట ఈ–క్రాప్ చేయిస్తేనే రానున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో లేదా ప్రభుత్వం సూచించిన చోట పంటను అమ్ముకునే పరిస్థితి. ఈకేవైసీకి అంతగా ప్రాధాన్యత ఇవ్వని కూటమి ప్రభుత్వం ఈ–పంట నమోదు విషయంలో తప్పనిసరిగా చేయాల్సిందేనని పేర్కొనడంతో క్షేత్రస్థాయిలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు(వీఏఏ) పంట నమోదును పూర్తి చేస్తున్నారు. అయితే ఈ–పంట నమోదు చేయడానికి అటు అధికారులను, ఇటు రైతులను సాంకేతిక సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నెల 25వ తేదీతో గడువు సమీపిస్తుండటంతో ఇప్పటికే పెడన నియోజకవర్గంలోని 65వేల ఎకరాల లక్ష్యానికి 56 వేల ఎకరాల్లో ఈ–పంట నమోదు పూర్తి చేసింది. మరో తొమ్మిది వేల ఎకరాలు నిర్ణీత గడువులోగా చేయడానికి క్షేత్రస్థాయిలో వీఏఏలు, మండల స్థాయిలో ఏఓలు తగిన చర్యలు చేపడుతున్నారు. అయితే సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవ్వడంతో వంద శాతం అవ్వదనే సంకేతాలను సైతం అధికారులు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

మండలాల వారీగా ఈ–పంట నమోదు

ఈ నెల 25వ తేదీతో గడువు పూర్తి కానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇంచుమించు పూర్తి కావచ్చింది. గూడూరులోనే అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పలు దఫాలు గడువు పెంచారు. వాస్తవంగా సెప్టెంబర్‌తో ఈ–పంట నమోదు పూర్తవ్వాల్సి ఉండగా,



ఈ–పంట నమోదు చేస్తున్న వీఏఏ

వీఏఏలు బదిలీలు అయి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రభుత్వం గడువును అక్టోబరు 25వ తేదీ వరకు పెంచడంతో ఇప్పటికే చాలా పూర్తి చేశారు. పెడన మండలంలో 20,300 ఎకరాలకు గాను 19,600 ఎకరాల వరకు ఈ–పంట నమోదు చేశారు. బంటుమిల్లి మండలంలో 12,800 ఎకరాలకు 12,200 ఎకరాల్లో ఈ–పంట నమోదు చేయగా మరో 600ఎకరాల్లో పంట నమోదు చేయాల్సి ఉంది. కృత్తివెన్ను మండలంలో 5,233 ఎకరాలను ఈ–పంటలో నమోదు చేయగా మరో 200 ఎకరాలు పెండింగ్‌లో ఉంది. గూడూరు మండలంలో 27,301 ఎకరాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉండగా 19,305 ఎకరాల్లో ఈ–పంట నమోదు చేశారు. మరో 7,996 ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం



ఈ–పంట నమోదులో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. చాలా వరకు ఈ–పంట నమోదు చేయడం జరిగింది. అయితే కొన్ని పంట పొలాలు చేపల చెరువులుగా చూపిస్తున్నాయి. అలాగే ఒకే సర్వే నెంబర్లు ఉండటం, డాక్యుమెంట్లు సరిగా లేకపోవడం, కొన్ని ఇంకా చేయాల్సి ఉండటం వంటి కారణాల వల్ల ఇబ్బందులు తలెత్తాయి. వీటిని త్వరితగతిన సరిచేసేలా చర్యలు తీసుకున్నాం. వీటికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది.

– సజ్జా జెన్నీ, ఏఓ, పెడన

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ లక్ష్మీశాకు సబ్కా వినతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సబ్కా కృష్ణా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల బిల్లులు అప్లోడ్, పేమెంట్స్‌పై ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ పాటించేలా జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ విభాగాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బడ్జెట్ కేటాయింపులు లేని వాటికి తక్షణమే కేటాయింపులు జరిగేలా చూడాలని విన్నవించారు. జిల్లాలో ఉన్న అన్ని ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సబ్కా కృష్ణా కమిటీతో జాయింట్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా మైనింగ్ ఫండ్ కింద చేసిన పనుల తాలూకు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సబ్కా ప్రతినిధులు

బకాయిలను విడుదల చేయాలని కోరారు. సబ్కా స్టేట్ కమిటీ కోఆర్డినేటర్ కూచిపూడి శివకుమార్, ట్రెజరర్ అప్పారావు, డిప్యూటీ కోఆర్డినేటర్ కూచిపూడి శ్రీనివాసరావు, సబ్కా కృష్ణా ప్రెసిడెంట్ మండవ సాయి, సెక్రటరీ రవి కిరణ్, ట్రెజరర్ వెంకటేశ్వర రాజు, రవిశ్రీ బాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

కోనేరుసెంటర్: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూనా రాంజీ పేర్కొన్నారు. గురువారం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎస్టీ పన్నులను నాలుగు స్లాబుల నుంచి రెండు స్లాబులకు కుదించడం గొప్ప సంస్కరణ అని అన్నారు. అయితే విద్యాసంస్థలను దృష్టిలో పెట్టుకొని కొన్ని వెసులబాట్లు ఉంటే బావుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డెప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్ స్వరూప రాణి సోదాహరణంగా జీఎస్టీపై అవగాహన కల్పించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా ఎం. శ్రావణి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ఉష, ఆచార్య మారుతి, ఆచార్య దిలీప్, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పెడన: సూపర్2.0పై మున్సిపాలిటీ పరిధిలో గురువారం రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బంగ్లా స్కూల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో కరపత్రాలను పంపిణీ చేశారు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఎల్.సిద్దిక్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అత్తిలి రంగమణి, మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఎం.నాగరాజు, మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.



పెడనలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పారదర్శకంగా భూముల రీసర్వే

సర్వే విభాగం డెప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసుల రెడ్డి

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు సర్వే విభాగం డెప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. మండలంలోని నారికేదాలపాలెంలో చేపట్టిన మూడవ విడత రీసర్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడిన డీడీ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో సర్వే జరిగిందని, అప్పట్లో క్రాస్ స్టాఫ్, చైన్‌ల ద్వారా నిర్వహించడం కారణంగా భూ కొలతల్లో కొంత వ్యత్యాసం వస్తుందన్నారు. ప్రస్తుతం చేపట్టిన రీసర్వే పూర్తిగా ఆధునిక విధానంలో సాగుతుండటంతో చిన్నపాటి వ్యత్యాసం కూడా ఉండదన్నారు. ఉమ్మడి ఆస్తులను కుటుంబ సభ్యులు విభజించుకుంటే వ్యక్తిగత ఎల్‌పీఎంలు కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.



నారికేదాలపాలెంలో రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రీనివాసులరెడ్డి

తద్వారా భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ప్రస్తుతం చేపట్టిన భూముల రీసర్వేకు రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారిణి ఎం.జోషిలా, సర్వే ఇన్‌స్పెక్టర్ లీలా ప్రసాద్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయవర్మ, మండల సర్వేయర్ మురళీకృష్ణ, రీసర్వే డీటీ కె.జి.ఎస్ సాయి, వీఆర్వో కాకుశేవ్వరరావు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

బంటుమిల్లి: హైదరాబాద్‌కు చెందిన మెమరీ మాథ్స్ అకాడమీ నిర్వహించిన అబాకస్ మాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు 62 మంది సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ శోభ, యంగ్ డైరెక్టర్ చైతన్య, వైస్ ప్రిన్సిపల్ హరిణి, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రతి గింజా కొనాలి

బంటుమిల్లి: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం కృష్ణాజిల్లా కమిటీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. గురువారం ఈ మేరకు బంటుమిల్లి తహసీల్దారుకు రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. అలాగే రబీలో రెండో పంటకు సాగునీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు కేశఖండనశాలకు శంకుస్థాపన

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంకు చెందిన కోనేరు ప్రాంగణంలో కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు గురువారం తెలిపారు. సీజీఎఫ్ నిధులు రూ. 1.20 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ వల్లభనేని బాలశౌరీ, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మందిరంలో గురువారం 5వ బ్యాచ్ ఉచిత కుట్టు శిక్షణా తరగతులను జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. డాక్టర్ పట్టాభి గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ స్వర్ణశ్రీ, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఇందిర, బొడ్డపాటి శైలజ, ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగమణి, కొత్తగుండు రమేష్, జిల్లా యువజన విభాగ సమన్వయకర్త సాయి కృష్ణ చైతన్య, ఐటీ సమన్వయకర్త బి.నరేంద్ర పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో వేలంపాట

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం వివిధ లైసెన్స్ హక్కుల కోసం సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మాట్లాడుతూ నవంబర్ 1, 2025 నుంచి అక్టోబర్ 31, 2026 వరకు ఏడాది కాలానికి షాపుల వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. అందులో నాగమల్లివృక్షం వద్ద ముడుపులు ఊడతీసుకుని వెళ్లే లైసెన్స్‌ను మోపిదేవికి చెందిన రాయన శ్రీలక్ష్మి పొందినట్లు తెలిపారు. నాగులచవితి, కార్తికమాసం ఈ నెల రోజులల్లో చాందిని, ఐరన్ వాటర్ ప్రూఫ్ పెండిల్స్, ఐరన్ క్యూలైన్లు ఏర్పాటు చేయుట, ఆలయంలోని వెదురువాసాలు, సరుగుబాదులు పొందేందుకు మచిలీపట్నంకు చెందిన సీహెచ్ తిరుమలరావు లైసెన్స్ పొందారు. అలాగే ఆలయంలో 100 చీరలు పొందే హక్కు గుణసుందరి, నాగులచవితి నుంచి కార్తికమాసం షష్ఠి వరకు విద్యుత్



మోపిదేవి దేవస్థానంలో వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

దీపాలంకరణకు సీహెచ్ రాజశేఖర్, స్టేజీ ఈవెంట్ ఐటమ్స్, పచ్చి పూల అలంకరణకు నరేష్, ఉప్పాల అమలేశ్వరావు టెండర్ పొందినట్లు వివరించారు. సకలేశ్వరస్వామి దేవస్థానం ఈఓ జోగి ప్రవీణ, ఆలయ సూపరిటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, ఆలయ అధికారులు, సిబ్బంది, పాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి

ఘంటసాల: మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఆర్ఎం) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని లైవ్‌హుడ్ (ఎల్‌హెచ్) ఏపీఎం కె.శ్రీనివాసులు అన్నారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో ఘంటసాల మండల మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యుల అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి మండలంలో మహిళా ఉత్పత్తిదారులు (పీజీలు), మండలానికి ఒక ఉత్పత్తిదారుల సంస్థ (పీఈ)లు ఉంటాయన్నారు. ఎన్ఆర్ఎల్ఆర్ఎం పథకం ద్వారా గ్రామస్థాయిలో డ్వాక్రా, ఇతర మహిళల జీవనోపాధి పెంపొందించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించి తక్కువ ఖర్చుతో ఎక్కువ అధిక ఆదాయం వచ్చేలా చేస్తున్నట్లు తెలిపారు. మహిళా రైతు సంఘాలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పంటలు వేసేందుకు రూ.40 లక్షల నుంచి రూ. ఒక కోటి రూపాయల వరకు రుణాలు ఇచ్చేందుకు అవకాశాలు ఉన్నాయని శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ఎస్.నాగరాజు, అచ్చమాంబ, ఐసీఆర్పీలు, ఘంటసాల మండల మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రెసిడెంట్ కె.లక్ష్మీవీరమ్మ, కార్యదర్శి కె.వడ్డీకాసులు, సీసీలు నరసమ్మ, నాగేశ్వరమ్మ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మృతులకు పేర్ని నాని, కిట్టు నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలో మృతిచెందిన ఇరువురి భౌతికకాయాలకు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లు నివాళులర్పించారు. నగరంలోని శారదనగర్‌లో బుధవారం మృతిచెందిన విద్యాశాఖ రిటైర్డ్ ఉద్యోగి తేళ్ల దేవకుమార్(65), నారాయణపురంకు చెందిన మెప్మా ఆర్పీ నాగలక్ష్మి రెండవ కుమారుడు తాడిశెట్టి సృజన్(17) భౌతికకాయాలను గురువారం వారు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. దేవకుమార్ శవపేటికను పేర్ని నాని, కిట్టు మోస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్ బాబు (జానీ), కార్పొరేటర్లు ఎండ్రపాటి నాగేశ్వరరావు, భోగాది సాయిబాబు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్ కుమార్, నాయకులు ధనికొండ శ్రీనివాస్, సత్తెనపల్లి శ్రీనివాస్, పాండే, చీలి రవీంద్ర, ధనికొండ వెంకటేశ్వరరావు, ఓసూరి అయ్యప్ప (మున్నా) తదితరులు ఉన్నారు.



దేవకుమార్ శవ పేటికను మోస్తున్న పేర్ని కిట్టు

కార్యకర్తను పరామర్శించిన కిట్టు

కోనేరుసెంటర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పెదపట్నం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఊర రజనీకాంత్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పరామర్శించారు. గ్రామానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కిట్టుతోపాటు పార్టీ నార్త్ రైతు విభాగం అధ్యక్షుడు గడిదేసి రాజు, మండల నార్త్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడదేసి పెద్ద వెంకయ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌ఛార్జి ఉప్పాల రాము

గూడూరు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే దుర్మార్గమైన ఆలోచనతోనే రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాము విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని తరకటూరు, మద్దిపట్ల, పోలవరం, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలన్న లక్ష్యంతో ఆనాడు జగనన్న రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో ఇప్పటికే 5 కాలేజీల నిర్మాణ పనులు పూర్తి చేసుకోవడమే కాకుండా తరగతులు కూడా జరుగుతున్నాయన్నారు. అయితే మెడికల్ కాలేజీల క్రెడిట్ వైఎస్సార్ సీపీకి దక్కనీయకూడదన్న కుట్రతో వాటిని ప్రైవేటీకరణ చేసి కూటమి శ్రేణులకు లబ్ధిచేకూర్చడానికి చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ కుట్రలు అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్, నాయకులు సంగా మధుసూదనరావు, వేముల సురేష్ రంగబాబు, గొరిపర్తి రవికుమార్, పిండి వెంకన్నబాబు, కారుమంచి కామేశ్వరరావు, జక్కా రాజేష్, గళ్లా కేశవ, కనపర్తి శ్రీనివాసరావు, నక్కిన నాగరాజు, పిచ్చుక గంగాధరరావు, లుక్కా ఏలేషు, కుటుంబరావు, బత్తిన స్వామి, రాయన శ్రీహరి, మెరుగుమాల వీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో జరిగిన సంతకాల సేకరణలో ఉప్పాల రాము

ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించాలి

ఘంటసాల: అధికారులు, రైతుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ సూచించారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పౌర సరఫరాల శాఖ డీఎం ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాఫ్ చేసిన రైతుల నుంచి మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల ద్వారా ధాన్యాన్ని టెక్నికల్ అసిస్టెంట్లు సేకరించి తేమ శాతం పరిశీలించి జీపీఎస్ ఉన్న వాహనాల ద్వారా సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని వివరించారు. ధాన్యం మిల్లుకు తరలించే వరకు అధికారులు తీసుకోవాల్సిన అంశాలపై పౌరసరఫరాల శాఖ డీఎం ప్రతినిధులు ఎం.హెప్సీబా, వి.భారతిలు వీఏఏలు, టీఏలు, డీఈఓలు, కస్టోడియన్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం తరలించేందుకు ఆయా గ్రామాల్లోని ట్రాక్టర్లు, లారీల యజమానులు సమీపంలోని ఆర్ఎస్‌కేల్లో జీపీఎస్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారిణి డి.అనూష అన్నారు. రైతులందరూ ఒకేసారి ధాన్యం నూర్పిడి చేయకుండా అవగాహనతో విడతల వారీగా చేసుకుని ధాన్యం కొనుగోలు చేసే సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాస్, కస్టోడియన్ అధికారులు, వీఏఏలు, టీఏలు, డీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై శిక్షణను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ ప్రసాద్, ఏఓ అనూష

సకాలంలో సరుకులు అందక అవస్థలు

బంటుమిల్లి: బంటుమిల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో నిత్యావసర సరుకులు అందకపోవడంతో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని 68 రేషన్ షాపులు ద్వారా 138 అంగన్‌వాడీ కేంద్రాలు, 111 ప్రభుత్వ పాఠశాలలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తారు. అయితే అక్టోబరు సరుకులు సెప్టెంబరులో సరఫరా చేయాల్సి ఉండగా గోడౌన్‌లో స్టాక్ లేక సకాలంలో అందజేయలేకపోయారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమీపంలోని పాఠశాలల్లో బియ్యం ఎక్కువగా ఉన్నచోట చేబదులు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలది కూడా ఇదే దుస్థితి. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన కిరాయిలు సకాలంలో ఇవ్వకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. అయినా కూడా ప్రభుత్వం అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకపోవడంపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం సకాలంలో అందడం లేదు. గోడౌన్ ఇంఛార్జి సుభాన్‌బీ మాట్లాడుతూ కాంట్రాక్టరుతో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.



ఎంఎల్ఎస్ పాయింట్ వద్దకు సరుకుల కోసం వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఆరు నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మల్లవోలు, ముత్రాసిపాలెం, పోలవరం, ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, రాయవరం, రెడ్డినాయుడు అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.